క్లుప్తంగా

వృద్ధులకు పింఛన్లు, దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు నగదు అందిస్తున్న సంస్థ సభ్యులు

సీటీఆర్ఐ: వాకర్స్ యోగా లాఫింగ్ క్లబ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ కేవీటీ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని ఆనందా గార్డెన్స్‌లో సోమవారం వృద్ధులకు పింఛన్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు శనపతి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 80 మందికి రూ.500 చొప్పున రూ.40 వేలు అందజేశారు. ఆనాపు పుల్లేశ్వర రావు నాలుగో వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వారణాసి కామేశ్వరి రచయిత వారణాసి సుబ్రహ్మణ్యం కుమార్తె వారణాసి కామేశ్వరి విద్యానిధికి రూ.10 వేలు వితరణ చేశారు. కార్యక్రమంలో పామర్తి గోపాలరావు, గుబ్బల గంగాభవాని, దేవీ శ్రావణం, సూరపు రెడ్డి తాతారావు, మరిడి బాబులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

సీటీఆర్ఐ: స్థానిక బర్మా కాలనీ మూడో వీధిలో సోమవారం హోప్ లైన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇవాంజెలికల్ హెల్పింగ్ హ్యాండ్ సంస్థ డైరెక్టర్ హరిత ఆర్మస్ హాలోనిస్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. కేంద్రంలో ఆరు నెలలకు 25 మంది చొప్పున సంవత్సరానికి 50 మందికి శిక్షణ ఇస్తామని చారిటబుల్ వ్యవస్థాపకుడు కె.సురేష్ కుమార్ తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

ఏపీఎన్జీవో కేలండర్ ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ఉద్యోగుల తోడ్పాటు ఎంతో అవసరమని కలెక్టర్ మాధవీలత అన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఏపీ ఎన్జీవో రాజమహేంద్రవరం నగర శాఖ ప్రచురించిన ఉద్యోగుల కేలండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉద్యోగులు క్రమశిక్షణగా, నిజాయితీగా ఉండాలన్నారు. నగర ఎన్జీవో సంఘ అధ్యక్షుడు యెరుబండి సుబ్బారావు నాయుడు, కార్యదర్శి ప్రవీణ్ కుమార్, ఏపీ జేఏసీ కార్యదర్శి వేణుమాధవ్, ఉపాధ్యక్షులు ప్రతాప్, నాగ శ్రీనివాస్, సత్యనారాయణరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా

రాజమహేంద్రవరం సిటీ: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధ్యమని, దేశంలో తమ పార్టీని అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక హోదా ఫైలుపైనే తొలి సంతకం చేస్తారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, పీసీసీ సభ్యుడు బాలేపల్లి మురళీధర్ పేర్కొన్నారు. కృష్ణానగర్‌లోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక హోదాతో యువతకు ఉపాధి, రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: బాలాజీపేట సెంటర్‌లోని విజయ కనకదుర్గమ్మ ఆలయ నాలుగో వార్షికోత్సవం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

బీటెక్ విద్యార్థికి ఆర్థిక సహాయం

సీటీఆర్ఐ: నగర కాపునాడు కార్యవర్గం, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్టు తరపున బీటెక్ విద్యార్థికి ఆర్థిక సహాయం చేసినట్టు కాపునాడు నగర పార్లమెంట్ అధ్యక్షుడు గుదే రఘునరేష్ అన్నారు. ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో గల ఎస్ఎంఎస్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ డేటా సైన్స్ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) చదువుతున్న జక్కం హర్షవర్ధన్ దుర్గేషకు కాపునాడు ఆర్థిక సహాయం చేసింది. ఈ విద్యార్థి ఆర్థిక ఇబ్బందులతో ఫీజు చెల్లించడానికి ఇబ్బంది పడుతున్నందున విద్యార్థి తల్లిదండ్రులైన జక్కం సాయిబాబా, మాధవీలకు నగర కాపునాడు కార్యవర్గం తరపున రూ.15 వేలు, పంతం సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.3 వేలు కలిపి మొత్తం రూ.18 వేలు అందించారు. కార్యక్రమంలో సీసీసీ చానల్ ఎండీ, పంతం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ పంతం కొండలరావు, అధ్యక్షుడు ముమ్మిడి వీరబాబు, ప్రధాన కార్యదర్శి నల్లం శెట్టి వీరబాబు, కార్యదర్శులు చోడిశెట్టి పళ్లం రాజు, ర్యాలీ రామకృష్ణ, సంయుక్త కార్యదర్శి రుద్ర దుర్గాప్రసాద్, యువజన విభాగం అధ్యక్షుడు అక్కిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీరాముని జీవితం ఆదర్శప్రాయం

- ఎంపీ భరత్‌రామ్
- సుబ్బారావుపేటలో ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



రామాలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: శ్రీరాముని జీవితం అందరికీ ఆదర్శప్రాయమని, రామనామాన్ని స్మరిస్తే మనకు కావాల్సిన అన్నీ ఆయనే సమకూరుస్తాడని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ మార్గాని భరత్ రామ్ అన్నారు. స్థానిక 3వ డివిజన్ సుబ్బారావుపేటలో శ్రీరామ ఆలయ పునర్నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారతీయులు 500 ఏళ్లుగా ఎదురు చూస్తున్న అయోధ్యలో రామ మందిర నిర్మాణం నేటికి పూర్తయిందన్నారు. అదే మాదిరిగా సుబ్బారావుపేట ప్రాంత వాసులు ఐదేళ్లుగా ఎదురు చూస్తున్న రామాలయం నిర్మాణానికి ఆ శ్రీరామ చంద్రుడు తన ద్వారా శంకుస్థాపన చేయించి, పునర్నిర్మాణ పనులకు అవకాశం కల్పించడం తన అదృష్టం అన్నారు. వచ్చే శ్రీరామనవమికి ఈ ఆలయం పూర్తయి, భారీ ఎత్తున శ్రీరాముల వారి కల్యాణం జరగాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బళ్ల శ్రీనివాస్, బొంతా శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

కోవర్టు ఆపరేషన్ స్టార్ట్

వెన్నుపోటు పొడవడం తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడికి అలవాటేనని, 2024 ఎన్నికలలో పవన్ కల్యాణ్ దొరికేసినట్లేనని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ అధికారంలో ఉన్న పార్టీలోకి తమ మనుషులను పంపి రాజకీయాలు చేయడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. కేంద్రంలో బీజేపీలోకి టీడీపీ ఎంపీలు వెళ్లడం చంద్రబాబు డైరెక్షనే అన్నారు. ప్రస్తుతం 2024 ఎన్నికలకు టీడీపీ - జనసేన పొత్తులో భాగంగా సీట్ల సర్దుబాటుపై చంద్రబాబు ఉచ్చులో కచ్చితంగా పవన్ పడతారన్నారు. టికెట్ల కోసం టీడీపీ వాళ్లనే జనసేనలోకి పంపి, గెలిచిన తరువాత టీడీపీలోకి రప్పించుకోవడం ఖాయం అన్నారు. చంద్రబాబు, పవన్ అజెండా జగన్‌ను అధికారంలో నుంచి దింపడమే తప్పిస్తే ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం మాత్రం కాదన్నారు.

జగన్ పాలనకు ఆదరణ

ప్రజలకు జగనన్న పాలనపై పూర్తి సంతృప్తి ఉందని, మరోసారి సీఎంగా జగనన్నను గెలిపించడానికి ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని ఎంపీ అన్నారు. టీడీపీ నాయకులు 15 ఏళ్లుగా పాలించి చారిత్రక నగరాన్ని పెద్ద పల్లెటూరు మాదిరిగా చేశారన్నారు. 2015 పుష్కరాలకు అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.2 వేల కోట్లు నగరాభివృద్ధికి మంజూరు చేసినట్టు చంద్రబాబే చెప్పారని, మరి ఆ నిధులతో ఏమి అభివృద్ధి చేశారంటే ఒక్క టీడీపీ నాయకుడూ నోరు విప్పడం లేదన్నారు. కోటిలింగాల ఘాట్, రోడ్డు కం రైల్వే బ్రిడ్జికి చిన్న చిన్న విద్యుద్దీపాలు పెట్టేసి రూ.2 వేల కోట్లు స్వాహా చేశారన్నారు. ఎంపీగా నగరాన్ని అభివృద్ధి చేస్తుంటే నిధులు దుర్వినియోగం చేస్తున్నానని లబోదిబోమనడం విడ్డూరంగా ఉంటోందన్నారు. కేవలం రూ.400 కోట్లతో నగర రూపు రేఖలు మార్చి మహా నగరంగా తీర్చిదిద్దామన్నారు. అభివృద్ధి చేశాం కాబట్టే కంబాల చెరువు పార్కు అందాలు వీక్షించడానికి ప్రజలు వెళుతున్నారన్నారు. హ్యాపీ స్ట్రీట్, ఈట్ స్ట్రీట్, ఏకేసీ పార్కు, సుబ్రహ్మణ్యం మైదానం.. ఇలా ఏది చూసుకున్నా అద్భుతంగా తీర్చిదిద్దన్నట్టు తెలిపారు. నగరం నడిబొడ్డున ఉన్న గాంధీ పార్కును సుందరీకరణ చేశామని, ఈనెల 15న ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. మోరంపూడి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు కూడా వేగంగా జరుగుతున్నాయని, మార్చి రెండోవారంలో ప్రారంభించే అవకాశం ఉందని ఎంపీ భరత్‌రామ్ తెలిపారు.

కేసీజీఎఫ్ రాక్ కపుల్స్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: సామాజిక సాంస్కృతిక కార్యక్రమాలతో, సమర్థ నాయకత్వంతో వాసవీ క్లబ్ కేసీజీఎఫ్ రాక్ కపుల్స్ రాజమండ్రిని ఇంటర్నేషనల్ స్థాయిలో గుర్తింపు పొందేలా కృషి చేస్తామని నూతన అధ్యక్షురాలు వెత్స అరుణ, సెక్రటరీ సంతోషి తెలిపారు. ఆ సంఘ 13వ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు మాట్లాడుతూ ప్రతి క్లబ్ సభ్యుల ఇంటిలో మొక్కలు పెంచి, పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయడం, మహిళా నాయకులను తయారు చేయడం వంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వీఎస్ ఎమరాల్డ్ కేసీజీఎఫ్ శ్రేయోభిలాషి బోడా సాయి సూర్య ప్రకాష్, ఇన్స్టాలేషన్ ఆఫీసర్ కాళ్లకూరి ప్రవీణ్ కుమార్, స్పెషల్ ప్రత్యేక ఆహ్వానితుడు మానేపల్లి ఆర్ఆర్ రమేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాడీ బిల్డింగ్ పోటీలు



విజేతలతో పోటీల నిర్వాహకులు

ప్రకాశం నగర్: కోటిపల్లి బస్టాండ్ సమీపంలోని గౌతమీ వ్యాయామ కళాశాలలో రాష్ట్ర 15వ మిస్టర్ ఇండియా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీల్లో 18 జిల్లాలకు చెందిన 155 మంది పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ అడ్డూరి వెంకట రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా బొమ్మన జయ కుమార్, బిగ్‌వింగ్ అధినేత ఇమ్మాని బుల్లి వెంకటరావు, మొఘల్ బిర్యానీ అధినేత మహ్మద్ ఇస్మాయిల్ తాహీర్, రాజ్‌కమల్ జ్యూయలర్స్ అధినేత జి.నరసింహారావు, పల్లె మధు, ప్రవీణ్ నాయుడు, మిస్టర్ ఇండియా విన్నర్ కె.రామాంజనేయులు హాజరయ్యారు. జయకుమార్ మాట్లా డుతూ బాడీ బిల్డర్లు జాతీయస్థాయి పోటీల్లో రాణించాలన్నారు. రమణమూర్తి మాట్లాడుతూ ఈ పోటీల్లో పది విభాగల్లో 12 మందిని విజేతలుగా ప్రకటించామన్నారు. వీరందరూ త్వరలో కేరళలో జరిగే సౌత్‌జోన్ పోటీలు, ఆలిండియా బాడీ బిల్డింగ్ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొంటారన్నారు. రాష్ట్ర చాంపియన్‌షిప్ టైటిల్‌ను నంద్యాల జిల్లాకు చెందిన బి.ముకుంద గెలుచుకున్నారు. రన్నర్‌గా కాకినాడ జిల్లాకు చెందిన కె.సింధు నిలిచాడు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా మారయ్య, గోపి, నగేష్, డీవీ సత్యనారాయణ, వాసు వ్యవహరించారు.

విశాఖలో నగర యువకుడి మృతి



చింతా ప్రణవ్‌రెడ్డి (ఫైల్)

కంబాలచెరువు: స్థానిక సీపీ రెడ్డి హీరో షోరూం అధినేత చింతా ప్రసాద్‌రెడ్డి కుమారుడు నాగ ప్రణవ్‌రెడ్డి (24) ఆదివారం రాత్రి విశాఖలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దానవాయిపేటకు చెందిన నాగ ప్రణవ్ రెడ్డి గీతం కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. సెలవులకు ఇంటికి వచ్చి, కొద్దిరోజుల క్రితం తిరిగి విశాఖపట్నం వెళ్లాడు. అక్కడ రుషికొండ నుంచి తన మోటారు వాహనంపై వెళ్తుండగా బుల్లెట్‌పై అతివేగంగా వచ్చిన ఇద్దరు యువకులు ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన ప్రణవ్ రెడ్డిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. మృతదేహాన్ని సోమవారం దానవాయిపేటలోని ఇంటికి తీసుకువచ్చారు. వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, టీకే.విశ్వేశ్వరరెడ్డి, అజ్జరపు వాసు, గుబ్బల రాంబాబు, గంటా సునీల్, వివిధ పార్టీల నాయకులు, చాంబర్ ప్రతినిధులు, నగరంలోని పలువురు వ్యాపారవేత్తలు తరలివచ్చి, ప్రణవ్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పించారు. ప్రసాద్ రెడ్డి, కుటుంబ సభ్యులను ఓదార్చారు.

తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ



ఆర్డీవో చైత్రవర్షిణికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అర్బన్ తహసీల్దార్ ఆంజనేయులు



రూరల్ తహసీల్దార్ అప్పారావు



కడియం తహసీల్దార్ రమాదేవి

సీటీఆర్ఐ: నూతనంగా బదిలీపై వచ్చిన తహసీల్దార్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం అర్బన్ తహసీల్దార్‌గా కాకునూరి ఆంజనేయులు నియమితులయ్యారు. ఆయన కృష్ణాజిల్లా గుడివాడ నుంచి ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ పనిచేసిన సుస్వాగతం ఎన్టీఆర్ జిల్లా కంచికచర్లకు బదిలీ అయ్యారు. కాగా.. తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆంజనేయులు రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్రవర్షిణిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రూరల్ తహసీల్దార్‌గా అప్పారావు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ తహసీల్దార్‌గా వైకేవీ అప్పారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరేట్ పరిపాలనాధికారిగా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన పైడి చిన్నారావు ఎన్టీఆర్ జిల్లా విజయవాడ వెస్ట్‌కు బదిలీ అయ్యారు. కాగా.. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అప్పారావుకు డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ సుధీర్, సర్వే డిప్యూటీ తహసీల్దార్ సాగర్, సర్వేయర్ శ్రీనివాసరెడ్డి, ఏఎస్‌వో రామం, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కడియం తహసీల్దార్‌గా రమాదేవి

కడియం: కడియం తహసీల్దార్‌గా బి.రమాదేవి బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు కలెక్టరేట్ ఏవోగా ఉన్న ఆమె ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన సుజాత కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

- జిల్లా ఎస్పీ జగదీష్
- లెజెండ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ జగదీష్

ప్రకాశం నగర్ : క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ఉల్లాసం చేకూరుతుందని జిల్లా ఎస్పీ పి.జగదీష్ అన్నారు. రాజమహేంద్రవరం డిస్ట్రిక్ట్ పోలీస్ ఆఫీస్ ఆవరణలోని పోలీస్ క్రికెట్ గ్రౌండ్‌లో లెజెండ్ క్రికెట్ టోర్నమెంట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీస్ కార్యాలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రౌండ్‌లో క్రికెట్ మ్యాచ్ ఆడడం చాలా సంతోషంగా ఉందన్నారు. 40 ఏళ్ల పైబడిన వారికి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని, నిర్వాహకుడు బాలాజీని ప్రశంసించారు. తొలి మ్యాచ్‌లో కోనసీమ లెజెండ్స్‌పై ఆనంద్ వారియర్స్ జట్టు విజయం సాధించింది.

డ్రైనేజీ సమస్యపై వినతి

కడియం: వీరవరం గ్రామంలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలంటూ బీజేపీ మండల నాయకులు సోమవారం తహసీల్దార్ బి.రమాదేవికి వినతిపత్రం అందించారు. పార్టీ మండల అధ్యక్షుడు నాగులపల్లి వీరబాబు, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బొరుసు సుబ్రహ్మణ్యం, మండల ప్రధాన కార్యదర్శి చిక్కాల శ్రీను, గారపాటి తాతబ్బాయి, పాఠం శెట్టి రాజేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి లక్షణాలపై అవగాహన



గాంధీజీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న వైద్య సిబ్బంది

కడియం: మాధవరాయుడుపాలెం పంచాయతీ పరిధి చైతన్య నగర్‌లోని కాలనీలో లెప్రసీ అవగాహన కార్యక్రమం సోమవారం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి మౌర్య ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ప్రతి సంవత్సరం పక్షోత్సవాలు నిర్వహిస్తారన్నారు. అందులో భాగంగా కాలనీలోని 18 మందికి దుప్పట్లు, టవళ్లు, మెడికల్ కేర్ కిట్లు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం అందించారు. డాక్టర్ ఎస్.వసుంధర మాట్లాడుతూ కుష్ఠువ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ టీమ్ డీపీఎంఓ జోగేశ్వర రావు, స్థానిక ఆరోగ్య విస్తరణాధికారులు ఎంబీవీ రామకృష్ణ, ఎండీ అలీ బేగ్, సిబ్బంది మణి దీప్తి, రాము, మూర్తి పాల్గొన్నారు. ముందుగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

చిలుకూరికి తెలుగుభాషా సేవారత్న పురస్కారం



పురస్కారం అందుకుంటున్న చిలుకూరి శ్రీనివాసరావు

కడియం: గ్రామానికి చెందిన రచయిత చిలుకూరి శ్రీనివాసరావు సోమవారం తెలుగుభాషా సేవారత్న పురస్కారం అందుకున్నారు. అధికార భాషా సంఘం, నాగార్జున విశ్వవిద్యాలయం, ప్రవాసాంధ్ర తెలుగు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పత్రికా రంగంలో విశేష సేవలు అందిస్తున్న పలువురికి గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో వీటిని అందించారు. వివిధ దినపత్రికల్లో శ్రీనివాసరావు రాస్తున్న వ్యాసాలకు గాను ఈ అవార్డును అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు, ప్రెస్ అకాడమీ పూర్వపు అధ్యక్షుడు కొమ్మినేని శ్రీనివాసరావు, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, సినీ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ రాజశేఖర్ తదితరులు పురస్కారం ప్రదానం చేశారు.

పోస్టర్ ఆవిష్కరణ

కడియం: ఉద్యోగుల ఓపీఎస్‌కు మద్దతు ఇచ్చే పార్టీకే ఓటేస్తామని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి ఈవీవీఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. కడియం మండల యూటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం ఓట్ ఫర్ ఓపీఎస్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్బాయి, వేదుల శాస్త్రి, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.అనిత, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఈపీఎఫ్‌వో 95 పెన్షనర్ల నిరసన

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి జంక్షన్ సమీపంలోని పీఎఫ్ కార్యాలయం వద్ద సోమవారం ఈపీఎఫ్‌వో 95 పెన్షనర్లు నిరసన దీక్ష చేపట్టారు. అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ మోహనరావు మాట్లాడుతూ కనీస పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలని, భార్యాభర్తలకు వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ సమావేశాలు జరిగే ఐదు రోజులూ దీక్ష నిర్వహిస్తామన్నారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారన్నారు. ఈ దీక్షలకు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్ఎస్ మూర్తి, కేఎస్‌వీ రామచంద్రరావు మద్దతు ప్రకటించారు.

మర్యాదపూర్వకంగా..



షేక్ నిజాంను శాలువాతో సత్కరిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌ను సోమవారం సాయంత్రం ఆయన కార్యాలయంలో రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ నిజాం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాగేశ్వర్ మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ముస్లిం, మైనార్టీలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ డైరెక్టర్ ఎండీ ఈబాదుల్లా ఖురేషి, రూరల్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు మహబూబ్, రూరల్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు ఇబ్రహీం బాషా, రాజమండ్రి రూరల్ మైనారిటీ సెల్ సీనియర్ నాయకులు హమీద్, ఇనాముల్లా, నజీర్, సద్గుణ రామారెడ్డి పాల్గొన్నారు.

గిరిజన నృత్యోత్సవం



- నన్నయలో ప్రారంభమైన వేడుక
- అలరించిన నృత్యాలు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) జాతీయ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే గిరిజన సంస్కృతి మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన గిరిజన కళాకారులు తమ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ఇచ్చిన ప్రదర్శనలు ఆహూతులను విశేషంగా అలరించాయి. గిరిజన మహిళల గ్రూప్ డ్యాన్స్, కొమ్ము నృత్యం, తలపై ధరించిన బిందెలతో చేసిన నాట్యాలు అబ్బురపరిచాయి. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సి.సుధాకర్, ప్రిన్సిపాల్ విజయ నిర్మల, ఐఎస్‌టీఎస్ కళాశాల చైర్మన్ ఉపేంద్రరెడ్డివారితో కలిసి నృత్యం చేసి, కళాకారులను మరింత చైతన్యపరిచారు.



డ్యాన్స్ చేస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్ తదితరులు



గిరిజన సాంస్కృతిక ప్రదర్శనలు



గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

ఆర్ట్స్ కళాశాలలో క్యాన్సర్‌పై సదస్సు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రామచంద్రరావు

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జంతుశాస్త్రం విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం నిర్వహించారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాలకు చెందిన డాక్టర్ ఎస్.రవిశంకర్, డాక్టర్ సమీజ, డాక్టర్ సుఫాన్, డాక్టర్ హిమశంకర్ మాట్లాడుతూ క్యాన్సర్లు, వాటి లక్షణాలు, చికిత్స విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు మాట్లాడుతూ మంచి నడవడిక, ఆహార అలవాట్లు పాటిస్తూ మత్తు పదార్థాలు, ధూమపానం వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జంతుశాస్త్రం విభాగాధిపతి కె.దుర్గారావు, కె.మహాలక్ష్మి, ఇండియన్ రెడ్‌క్రాస్, జీఎస్ఎల్ సిబ్బంది పాల్గొన్నారు.